
వరద తాకిడికి గురయ్యే ప్రాంతం ఇదే

గెడ్డ పోటు..!





- ప్రమాదకరంగా 49వ వార్డులోని చాకలి గెడ్డ
- చెత్త, వ్యర్థాలు తొలగించని సిబ్బంది
- రక్షణ గోడ నిర్మించక తరచూ ప్రమాదాలు
- అధికారుల తీరుపై స్థానికుల మండిపాటు

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డులోని చాకలి గెడ్డ ప్రమదాలకు అడ్డాగా మారింది. దీని చుట్టూ నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురళీనగర్ పరిధిలో అతి పెద్ద గెడ్డ ఇదే కావడం విశేషం. దీన్ని పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయకపోవడం వల్ల మాణిక్యాంబ కాలనీలోని గెడ్డకు ఇరువైపులా నివాసితులు అవస్థలు పడుతున్నారు. చాకలి గెడ్డ పేరు చెప్పగానే గతంలో ఇక్కడి ప్రజలు ఎదుర్కొన్న ప్రమాదకర సంఘటనలు స్థానికులను పీడకలలుగా వెంటాడుతున్నాయి. గతంలో ఒకసారి భారీ వరదలకు ఈ గెడ్డ కల్వర్టు గోడ కూలి పోవడమే కాకుండా వరద నీటి తాకిడికి కల్వర్టు రిటైనింగ్ వాల్ కొట్టుకుపోయి నివాసిత ప్రాంతాల్లోని ఇళ్లలోకి మురుగునీరు పోటెత్తింది. ఆనాటి నరకయాతనను ఈ ప్రాంతీయులు ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నారు. వందలాది కుటుంబాలు రోడ్డు పాలయ్యాయి. ప్రస్తుతం పరిస్థితి కాస్త మెరుగుపడినా ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని భయాందోళన చెందుతున్నారు.


రక్షిత గోడ నిర్మించాల్సిన ప్రాంతం

కుప్పలు తెప్పలుగా చెత్త

చాకలిగెడ్డలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు తెప్పలుగా పేరుకుపోయి కనిపిస్తోంది. భారీ ఎత్తున వాడి పడేసిన వస్తువులు, బొంతలు, బిల్డింగు మెటీరియల్, కూలిన వృక్షాల వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. వ్యర్థాలు కుళ్లిపోయి దుర్వాసన వ్యాపిస్తోందని నివాసితులు ఆందోళన చెందుతున్నారు. ఈ గెడ దోమలకు నిలయంగా తయారైందని వాపోతున్నారు. కొందరు రాత్రిపూట భారీగా చెత్తను తీసుకొచ్చి గెడ్డలో డంప్ చేస్తున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పూర్తి స్థాయిలో రక్షిత గోడ నిర్మించకపోవడం వల్ల చిన్నపిల్లలు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. వృద్ధులు అనేక సార్లు గెడ్డలో పడి గాయాలపాలయ్యారని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. మరోవైపు పారిశుధ్య సిబ్బంది చెత్తను తొలగించడమే లేదు.

పూర్తి మరమ్మతులకు మోక్షం ఎప్పుడో?

ఎన్‌జీజీవోస్ కాలనీ మాధవధార కొండ ఎగువ నుంచి ఈ గెడ్డ ప్రవహిస్తూ జాతీయ రహదారి సమీపంలోని ఊర్వశి కూడలి వద్ద కలుస్తుంది. అత్యంత పొడవైన ఈ గెడ్డకు అడుగడుగునా నీటి ప్రవాహానికి అడ్డంకులే. దీనికి ఇరువైపులా నివాసిత ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. పట్టాభిరెడ్డితోట కల్వర్టు వరకు మాణిక్యాంబ కాలనీ సమీపం వరకు దీనికి అడుగున కాంక్రీటు వేశారు. కేవలం 200 మీటర్ల ప్రాంతంలో అడుగున కాంక్రీటు వేయకపోవడం వల్ల వర్షాకాలంలో అక్కడి అంచుల్లోని నివాసితుల ఇళ్ల వరకు వరద నీరు పోటెత్తుతోంది. దీంతో అంచులు కోతకు గురై ఇళ్ల ముందున్న ప్రాంతం కూలిపోతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వర్షాలు వస్తే స్థానికులు తీవ్ర ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

చెత్త తీయడం లేదు



చాకలి గెడ్డలో పేరుకుపోయిన చెత్తను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది తీస్తామంటున్నారు తప్ప ఎప్పుడూ తీయడం లేదు. ఫొటోలు తీసుకుని వెళ్లిపోతున్నారు తప్ప తర్వాత ఎవరూ కనిపించడం లేదు. గతంలో ఓ సారి పొక్లెయిన్ తీసుకొచ్చినప్పటికీ చెత్త మాత్రం తరలించలేదు. చెత్త తీయకపోవడం వల్ల దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం.

– ఎల్లమెల్లి శివ, 49వ వార్డు

రక్షణ గోడ నిర్మించాలి



గత వారం ఒక మహిళ చాకలిగెడ్డలో పడిపోవడంతో గాయాలయ్యాయి. అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. వర్షం కురిస్తే ఈ ప్రాంతంలో జనం కొట్టుకుపోమే పరిస్థితి ఉంది. ప్రహరీ గోడ పూర్తి స్థాయిలో నిర్మించకపోతే వరదల్లో ఇబ్బందులు తప్పవు. ఫిర్యాదు చేసిన వెంటనే అధికారులు రావడం... తర్వాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారింది. తక్షణమే రక్షణ గోడ నిర్మించాలి.

–సీహెచ్.రాజు, స్థానికుడు

ఏడాదిగా చర్యలు శూన్యం



చాకలిగెడ్డలో చెత్త తొలగింపు, రక్షణ గోడ నిర్మాణంపై ఏడాదిగా అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా ఎవరూ స్పందించడం లేదు. ముఖ్యంగా పూడిక, చెత్త తొలగించాల్సి ఉంది. దోమలు పెరిగిపోయి ఇబ్బందులు పడుతున్నాం. మలేరియా, ఇతర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. తరచూ జ్వరాలతో బాధపడుతున్నాం. దోమల నివారణకు చర్యలు చేపట్టాలి.

– గొర్లె గౌరి, స్థానికురాలు

క్లుప్తంగా

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ


పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో నరసింహం

సీతంపేట: అనకాపల్లికి చెందిన పిరాట్ల నరసింహం సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా స్థానిక మధురానగర్ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం పుస్తకాలు పంపిణీ చేశారు. 300 నోట్సు పుస్తకాలను హెచ్‌ఎం డి.శాంతికుమారి చేతుల మీదుగా పిల్లలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో రోజూ ఏదో ఒక ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి వంద పుస్తకాలు అందజేస్తున్నానని, ఇలా ఏడాదికి 36,500 పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. 2014 నుంచి పదేళ్లుగా దాతల సహకారంతో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్నట్టు తెలిపారు.

12 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని మంగళవారం రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వేపోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ ఎస్‌కే అబ్దుల్ మారూఫ్, ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ చిట్టిబాబు సిబ్బందితో కలిసి మంగళవారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఢిల్లీకి చెందిన మొహమ్మద్ ముజామ్మిల్ అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. అతని వద్ద నుంచి 12 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

శ్రీలలితాపీఠంలో పాశుర విన్నపం


శ్రీలలితాపీఠంలో పాశురం విన్నవిస్తున్న అర్చకుడు

సీతంపేట: అక్కయ్యపాలెం శ్రీలలితా పీఠంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున పాశుర విన్నపం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం వేద పండితులు పాశురం విన్నవించారు. ముందుగా శ్రీభూ, నీలా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చన, బాలభోగం నివేదన, మంగళాశాసనం, మంత్రపుష్పం నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా గోదాదేవికి పంచామృత అభిషేకం, వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లకు అర్చన, బాలభోగ నివేదన జరిపారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా జనవరి 10న ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

నేటి నుంచి రెండో విడత రెవెన్యూ సదస్సులు

సీతమ్మధార: ప్రజల సమస్యలు, భూ వివాదాల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని విశాఖ అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ తెలిపారు. మంగళవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ రెండో విడత సదస్సుల షెడ్యూల్ వివరించారు. ఇందులో భాగంగా ఈ నెల 18న జీవీఎంసీ 42, 43, 44, 45వ వార్డుల్లోని ప్రజలకు అక్కయ్యపాలెం షాదీఖానా కల్యాణ మండపంలో సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే 19న 17, 18, 19, 20, 21, 22వ వార్డుల్లోని ప్రజలకు పెదవాల్తేరు గాంధీబొమ్మ సెంటర్‌లో, 20న 14, 25, 26, 42, 43, 44 వార్డుల ప్రజలకు అక్కయ్యపాలెం షాదీఖానా కల్యాణ మండపంలో సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలంతా భూ సమస్యలు, వివాదాలకు సంబంధించిన ధ్రువపత్రాలు, డాక్యుమెంట్లు, ఇతర ఆధారాలతో సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొంటారని, ప్రజలంతా సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కుటుంబ సభ్యులకు ఆరుగురు అప్పగింత


కుటుంబ సభ్యులకు అప్పగించిన వారితో కానిస్టేబుళ్లు

సీతమ్మధార: చలి తీవ్రత పెరిగి చాలా మంది నిరాశ్రయులు రైల్వేస్టేషన్లో తలదాచుకుంటున్నారు. ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లు ఇచ్చిన సమాచారంతో ఏయూటీడీ సిబ్బంది అక్కడికి వెళ్లి ఐదుగురు పురుషులు, ఓ మహిళను రెస్క్యూ చేసి షెల్టర్‌కు తరలించారు. శ్రీకాకుళానికి చెందిన రామారావు, బీహార్‌కు చెందిన అనీల్ కుమార్, కర్ణాటకు చెందిన ఆంజనేయ, జార్ఖండ్‌కు చెందిన సంజయ్, కోల్‌కతాకు చెందిన హరిధర్, ఒడిశాకు చెందిన ఆదివాసీ మహిళ కాంతమ్మ షెల్టర్‌కు తరలించారు. వీరంతా భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరిని ఆయా కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఏయూటీడీ సిబ్బంది తెలిపారు.

అన్ని దానాల్లో అన్నదానం మిన్న


కర్రి సత్యనారాయణరెడ్డి, సీతయమ్మ దంపతులతో గ్రామ పెద్దలు, స్వాములు

సీతమ్మధార: అన్ని దానాల్లోనూ అన్నదానం మిన్న అని కేఎస్ఎన్ఆర్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కర్రి మురళీ కృష్ణారెడ్డి అన్నారు. జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో గల శ్రీ శాంతి స్వరూపిణి ఆలయ ఆవరణలో కేఎస్ఎన్ఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత 42 రోజులుగా తమ ట్రస్ట్ ద్వారా అన్నప్రసాదం పంపిణీ చేసినట్టు తెలిపారు. రోజూ సుమారు ఆరు నుంచి ఎనిమిది వందల మందికి అన్నప్రసాదం అందించినట్లు పేర్కొన్నారు. అనంతరం కర్రి సత్యనారాయణరెడ్డి, సీతయమ్మ దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భారీగా మాలధారులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

25వ వర్డులో జెడ్సీ పర్యటన


రెల్లి వీధి నుంచి బుల్లయ్య కళాశాలకు రహదారిని పరిశీలిస్తున్న జెడ్సీ శివప్రసాద్, తదితరులు

సీతంపేట: జీవీఎంసీ జోన్ – 3 జోనల్ కమిషనర్ శివప్రసాద్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ మంగళవారం ఉదయం వార్డులో పర్యటించారు. సీతంపేట, రాజేంద్రనగర్, రెల్లివీధి, మధురానగర్, కనకమ్మ వీధి ప్రాంతాల్లో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. రాజేంద్రనగర్‌లో నిరుపయోగంగా ఉన్న పార్కు స్థలాన్ని, అపూర్వ ఆస్పత్రి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలాలను ఏ విధంగా వినియోగిస్తే బాగుంటుందని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. రెల్లి వీధిలో కొత్తగా నిర్మించిన సామాజిక భవనాన్ని పరిశీలించారు. రెల్లి వీధి నుంచి బుల్లయ్య కళాశాల రోడ్‌కు రాకపోకలకు మార్గం కల్పించాలని కాలనీ వాసులు ఎప్పటి నుంచో అడుగుతున్నందున సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. కనకమ్మ అలయం వద్ద ప్రజా మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. మధురానగర్‌లోని జీవీఎంసీ హైస్కూల్ సమీపంలో నిర్మిస్తున్న భవన అనుమతులపై వచ్చిన ఫిర్యాదుల మేరకు పరిశీలించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవునికి ప్రాతఃకాలార్చన


గోదాదేవి అమ్మవారి విగ్రహంతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, ఈవో, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 4 గంటలకు ప్రాతఃకాలార్చన నిర్వహించారు. ముందుగా గోదాదేవి అమ్మవారి ఉత్సవ విగ్రహంతో ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం తిరుప్పావై సేవా కాలం, విశేష భోగం, రెండో పాశుర విన్నపం, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. ఆలయ అర్చకులు శేషాచార్యులు, వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు అత్యధికంగా పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక అర్చనలు చేశారు. అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- మురళీనగర్ రామాలయంలో సీతారామచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి పాశుర విన్నపం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, సనపల వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వర్చువల్ ల్యాబ్స్‌పై శిక్షణ

డాబాగార్డెన్స్ : వర్చువల్ ల్యాబ్స్‌కి సంబంధించి సైన్స్ విభాగాల అధ్యాపకులకు విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల మాట్లాడుతూ వర్చువల్ ల్యాబ్స్‌ని విరివిగా వినియోగిస్తే విద్యార్థులు, అధ్యాపకులకు చాలా సమయం ఆదా అవుతుందన్నారు. అమృత విశ్వవిద్యాలయానికి చెందిన ప్రాజెక్ట్ మేనేజర్, రీసెర్చ్ అసోసియేట్‌తోపాటు కళాశాల నోడల్ కోఆర్డినేటర్ డాక్టర్ పీఎల్ శరణ్య పాల్గొన్నారు.

ఇంధన పొదుపుతో పర్యావరణ పరిరక్షణ


ఇంధన పొదుపు వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఈ శ్యామ్‌బాబు, ఈఈ బీకే నాయుడు, తదితరులు


సదస్సులో మాట్లాడుతున్న విద్యార్థిని

మురళీనగర్: ఇంధనం పొదుపు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.శ్యామ్‌బాబు పిలుపునిచ్చారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలను అల్లూరి సీతారామరాజునగర్‌లోని ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధనం పొదుపు చేసినప్పుడే భావితరాల అవసరాలను తీర్చగలమన్నారు. ముఖ్యంగా విద్యుత్‌ను అవసరాలకు మించి వాడొద్దన్నారు. అవసరం లేకపోయినా విద్యుత్ దీపాలు వెలిగించి ఉంచడం వల్ల ఖర్చులు కూడా పెరుగుతాయన్నారు. స్టార్ రేటింగ్ విద్యుత్ పరికరాలు వాడాలన్నారు. ఎల్‌ఈడీ బల్బులు, ఎల్‌ఈడీ ఫ్యానులు వాడడం ద్వారా విద్యుత్‌ను పొదుపు చేయవచ్చన్నారు. ఏసీ వాడినప్పుడు టెంపరేచర్ 24 డిగ్రీలు మించి ఉండాలన్నారు. సోలార్ రూఫ్ టాప్‌ల ద్వారా తక్కువ ఖర్చుతో విద్యుత్‌ను పొందవచ్చన్నారు. సోలార్ ప్యానెల్స్ 25 సంవత్సరాల జీవిత కాలం పనిచేస్తాయన్నారు. సోలార్ ఎనర్జీని ఉత్పత్తి చేసేవారికి ప్రభుత్వం సబ్సిడీ కల్పిస్తోందని, ప్రతి వినియోగదారుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక కిలోవాట్‌కు రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకూ ఖర్చు అవుతుందని, ప్రభుత్వం రూ.30 వేలు సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. 3 కిలోవాట్‌లు, ఆపైన ఎంత పెట్టుకున్నా రూ.78 వేలు సబ్సిడీ ఉంటుందన్నారు. డ్వాక్రా సీవో రత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు బీకే నాయుడు, డిప్యూటీ ఈఈ శివసత్యనారాయణ, మురళీనగర్ ఏఈ ఎం.రాజేష్, కంచరపాలెం ఏఈ ప్రసాద్, ఎస్ఎస్‌టీఎల్ వెంకటేశ్వరరావు, మర్రిపాలెం ఏఈ లలితాభాయ్ పాల్గొన్నారు.


సీతమ్మధార: జాతీయ ఇంధన వనరుల పొదుపు వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ప్లస్‌లో జరిగిన కార్యక్రమంలో డీఈఈ పి.జ్యోతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యుత్‌ను ఎలా ఆదా చేయవచ్చో వివరించారు. భవిష్యత్ తరాలకు ఇంధనం కావాలంటే ఇప్పటి నుంచే ఆదా చేయాలని కోరారు. సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచాలని సూచించారు. అందరికీ విద్యుత్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఈ హేమ, గోపీనాథ్, స్కూల్ హెచ్‌ఎం డి.రాంప్రసాద్, ఉపాధ్యాయురాలు సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌తో ఉద్యోగుల జీవనానికి భరోసా


జీవీఎంసీ గాంధీ పార్కులో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న పెన్షనర్స్

సీతమ్మధార: జీవీఎంసీ గాంధీ పార్కులో ‘పెన్షనర్స్ డే’ వేడుకలను ఏపీ ఆర్‌పీఏ విశాఖ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హిందుస్థాన్ షిప్‌యార్డు, జింక్, హెచ్‌పీసీఎల్, ఆర్టీసీ, బీహెచ్‌ఈఎల్ వంటి వివిధ సంస్థల నుంచి పెన్షనర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కె.ఎం.కుమార్ మంగలం మాట్లాడుతూ పెన్షనర్స్ డే ప్రాముఖ్యతను వివరించారు. నకార కేసులో న్యాయమూర్తి వై.వి.చంద్రచూడ్ తీర్పు అంశాలను తెలియజేశారు. అనంతరం ఏపీ ఆర్‌పీఏ గౌరవ అధ్యక్షుడు బి.టి.మూర్తి మాట్లాడుతూ ‘పెన్షన్ అంటే దానం కాదని, ఉద్యోగ విరమణ తర్వాత గౌరవప్రదమైన జీవనానికి హక్కు అని, భరోసా లభిస్తుందని పేర్కొన్నారు. కనీస పెన్షన్‌ను 9 వేలు ప్లస్ డీఏతో చెల్లించాలని కోరారు. భార్య, భర్తకు వైద్య సదుపాయాలు కల్పించాలని, రైల్వే ప్రయాణంలో రాయితీ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పెన్షనర్స్ వి.నర్సింగరావు, బుగత అప్పారావును తిరుపతిరావు, అప్పారావు, ఎస్.చలపతిరావు, సూర్యచంద్రరావు సత్కరించారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి కనకమహాలక్ష్మి అమ్మవారు

డాబాగార్డెన్స్ : మార్గశిర మాసోత్సవాల 16వ రోజు మంగళవారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. విశాఖ జిల్లా నలుమూలల నుంచే గాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు సమర్పించుకున్నారు. అమ్మవారికి ఉదయం 5 నుంచి 6 గంటల వరకు పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, ప్రత్యేక హోమాలు, సహస్రనామార్చన చేశారు. అష్టదళ పద్మారాధన పూజలో ఉభయదాతలు పాల్గొన్నారు.

త్రికాల పంచామృతాభిషేక సేవలో...

అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మార్గశిర గురువారాల్లో త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనదలచే భక్తులు రూ.7,500, గురువారం మినహా మిగతా రోజుల్లో రూ.2,500 పూజా రుసుం చెల్లించాలి. మధ్యాహ్నం టౌన్ కొత్తరోడ్డు సమీపాన గల జగన్నాథస్వామి ఆలయంలో 1500 మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, వేద పండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఓట్ల నమోదు, సవరణకు దరఖాస్తులు

సీతమ్మధార: విశాఖ ఉత్తర, తూర్పు నియోజకవర్గాల పరిధిలో 18 సంవత్సరాలు నిండిన వారు కొత్తగా ఓటు నమోదు చేయించుకోవాలని జీవీఎంసీ జోన్ – 3 జోనల్ కమిషనర్ కె.శివ ప్రసాద్ సూచించారు. సమీపంలోని సచివాలయంలో సిబ్బందిని సంప్రదించి ఓటు నమోదు చేసుకోవాలని, ఈ నెల 24 వరకు గడువు ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులు దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, ఫొటో జత చేసి అందజేయాలని సూచించారు. అలాగే ఓటరు కార్డులో చిరునామా, ఇతర వివరాల మార్పు కోసం కూడా దరకాస్తు చేసుకోవాలన్నారు. వేరే నియోజకవర్గం నుంచి ఇక్కడకు నివాసం మారిన వారు కూడా చిరునామా మార్పు కోసం గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తుదారుల ఇంటికి బీఎల్‌వోలు వెళ్లి విచారించిన తర్వాత మార్పులు చేస్తారని తెలిపారు.

వ్యాధి నిరోధక టీకాల పోస్టర్ విడుదల


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆవిష్కరించారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశా నోడల్ అధికారులు, ఇతర అధికారుల సమక్షంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య సేవలు, గర్భిణుల సేవలు, సపోర్ట్ సూపర్ విజన్, వ్యాధి నిరోధక టీకాలను సిబ్బందికి వివరించారు. కిల్కారి సేవలపై ఆశా కార్యకర్తల ద్వారా గర్భిణులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, జిల్లా మీడియా విస్తరణాధికారి (డిమో) బి.నాగేశ్వరరావు, డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, డాక్టర్ ఎన్.వి.సమత, జిల్లా సమన్వయకర్త కె.ధర్మేంద్ర, మణికుమారి పాల్గొన్నారు.

జీవీఎంసీ నిరాశ్రయ వసతి గృహంలో అన్నదానం


భోజనాలు వడ్డిస్తున్న జగన్నాథరావు, తదితరులు

సీతమ్మధార: రాష్ట్రంలో ప్రగడ ఇంటి పేరుతో ఉన్న కుటుంబ సభ్యులందరూ కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందని ప్రగడ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రగడ జగన్నాథరావు అన్నారు. మంగళవారం ట్రస్ట్ మొదటి సేవా కార్యక్రమంగా ద్వారకానగర్‌లోని ఏయూటీడీ -జీవీఎంసీ డే-నైట్ నిరాశ్రయ వసతీగృహంలో 85 మంది అభాగ్యులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ట్రస్ట్ కోశాధికారి ప్రగడ చక్రరావు, శేషు పాల్గొన్నారు.